# అమ్మ సంతృప్తి

-తనికెళ్ల కళ్యాణి

"రేపు ఉదయం కలుద్దాం" ఫ్రెండ్స్‌కి చెప్పి, బ్యాట్ ఊపుకొంటూ ఇంటి వైపు అడుగులేశాను.

సన్నజాజి పందిరి దగ్గర అమ్మ. ఇంటికి రాగానే అమ్మ కనబడితే ఎవరికైనా ఆనందమే కదా! నేను సంతోషంగా ముందుకెళ్లి పిలవబోయే లోపు, ఆగిపోయాను నాకాళ్లు తడబడ్డాయి. కారణం నా కంటికి ఎదురుగా కనబడిన అమ్మ కన్నీళ్లు. అమ్మ పమిట కొంగుతో కన్నీళ్లు వత్తుకుంటే నా మనసు ముకిళించుకు పోయింది. ఆమె చాలాసేపునుండే అక్కడ నిలబడిందని చాటుతూ పళ్లెంలోని కాసిని సన్నజాజులే చెపుతున్నాయి. అమ్మ వాటిని కోసే నెపంతో తనలోని బాధను దాచుకొంటోందని అర్థం చేసుకున్నాను.

"అమ్మా!" ఆత్మీయంగా పిలిచాను. అమ్మ తుళ్లిపడింది. గబగబా పమిట కొంగుతో మొహం తుడుచుకుంది. "నువ్వా! చంటీ! పువ్వులు కోసివస్తాను పద" అంది చిన్నగా. నన్ను అక్కడనుండి పంపే ప్రయత్నం అది. నేను గ్రహించాను.

"అమ్మా! నువ్వు లోపలికి వెళ్ళు. పూలు నేను కోసి తెస్తాను" అంటూ పళ్లెం అందుకున్నాను. పళ్లెం మౌనంగా అందించి వెళ్లబోయింది.

"అమ్మా! ఎంతో బాధపడితే కానీ నువ్వు కన్నీళ్ళు పెట్టవు. నేను నీ చంటినే అనుకుంటే విషయం ఏమిటో చెప్పమ్మా!" అన్నాను.

"ఏమీ లేదురా! మా నాన్నగారు గుర్తువచ్చి కన్నీళ్లు వచ్చాయి. అంతే!" అమ్మ లోపలికి వెళ్లింది. నాకు అన్నయ్య గదిలోనుండి మాటలు వినబడ్డాయి.

"ఇంతకీ నువ్వు పెళ్లికి వస్తున్నావా? లేదా?" అన్నయ్య అడుగుతున్నాడు.

"ఛీ... నా మూడ్ అంతా మీ అమ్మగారు పాడు చేసేశారు. నేను రాను. మీరు వెళ్లండి" వదిన కంఠం కోపంగా బదులిచ్చింది.

"ఎక్కడికైనా వెళతాననుకోగానే మీ అమ్మగారు రెడీ.. ఈ కనకాంబరం రంగు పట్టుచీర కట్టుకుని వెళ్లమ్మా! నా చంద్రహారం వేసుకొంటే బావుంటుంది. తలలో ఈ మాల పెట్టుకో... అంటూ నా ప్రాణం తినేస్తున్నారు. నా అలంకరణ విషయంలో ఆవిడ జోక్యం దేనికి? నాకు ఇష్టమైనట్లు నేను ఉండాలనుకోనా?" వదిన నిలదీస్తోంది. నాకు విషయం అర్థమైపోయింది. అమ్మ వెళుతున్నదల్లా ఏదో తప్పు చేసినట్లు నావైపు చూసింది. నేను బరువుగా నిట్టూర్చాను.

"జానీ! మురళి మనం వెళ్లకపోతే ఏమనుకొంటాడు? త్వరగా తెములు. అమ్మ పెద్దది.. ఏదో అంటుంది.. పట్టించుకోకు.. ఊ...వెంటనే తెమలాలి. చూడు.. నువ్వు ఏడిస్తే నేను చూడగలనా?" అన్నయ్య మృదుత్వం అంతా వదిన దగ్గరేనేమో?

"నేను డ్రెస్ వేసుకొని వస్తాను! సరేనా?" వదిన ఐదు నిమిషాలయ్యాక అడిగింది. పాపం.. మావాడు ఆమెను ప్రసన్నం చేసుకొందుకు ఎంత కష్టపడ్డాడో?ఉత్త బడుద్ధాయి.. ఇలాంటి వాడు ఎందుకు పెద్దవాడిగా పుట్టాడో? నా ప్రాణం ఎదురు తిరిగింది. అమ్మ ఎందుకు ఏడ్చిందో అర్థమైంది. పాపం. మా అన్నయ్యకి పెళ్లి అయిన ఏడాదినుండే మా అమ్మకి తాత గారు గుర్తువస్తూనే ఉన్నారు. సన్నజాజులు కోసి, నేను లోపలకి నడవడం వదిన, అన్నయ్య బయటకు రావడం ఒకేసారి జరిగాయి. చెమ్కీలా మెరుస్తున్న మోడరన్ డ్రెస్‌లో వదిన అంతకంటే మెరుస్తూ కన్పించింది. భుజం వరకూ రాని కట్ చేసిన జుట్టు అటూ ఇటూ కదులుతూంటే, వయ్యారంగా ఒక చేత్తో సర్దుకుంటూ నావైపు ఒక చూపు చూసి వెళ్లింది. నన్ను దాటగానే అన్నయ్య వదిన భుజంపై చెయ్యివేసి, నవ్వుతూ ఏదో అంటూ వెళ్లడం అమ్మ చూసింది.మా అమ్మ పేరుకి తగ్గట్టు నిజంగా మహాలక్ష్మి. ఆవిడ రాకతో తన జీవితం అదృష్టంవైపు మళ్లిందని మా నాన్నగారు గర్వంగా చెపుతారు. అటువంటి అమ్మ కడుపున పుట్టడమే మా అదృష్టం అంటాను నేను. నుదిటిపై కుంకమ, కళ్లకు కాటిక, అమ్మ గడ్డంకింద కుడివైపు పెసరబద్దంత నల్లటి పుట్టుమచ్చ. తెల్లటి అమ్మకి దిష్టిచుక్కలాగా ఉంటుంది. తలలో నిండుగా కన్పించే పువ్వులతో అమ్మ కళకళలాడుతూ ఉంటుంది. పసుపురాసిన పాదాలతో అమ్మ ఇంట్లో తిరుగుతుంటే మాకు కన్నుల పండుగ్గా ఉంటుంది.

వదిన వచ్చాక అమ్మ ఎంత సంబరపడిందో, ఎన్ని ఆశలు వదినపై పెట్టుకుందో నాకు తెలుసు.

"అమ్మాయిలేని నాకు కోడలే అమ్మాయి కదా! నా సరదాలన్నీ తీర్చుకుంటాను" కళ్ళల్లో జ్యోతులు ప్రకాశిస్తున్నట్లు, మెరిసిన కనుదోయితో నాన్నగారితో ఎప్పుడూ చెప్పేది.

"ఏ విషయంలోనూ అతిగా ఆశలు పెట్టుకోకు" నాన్నగారు చిరునవ్వుతో హెచ్చరించేవారు. కలత అంటే తెలియని అమ్మ, బాధను ఎరగని అమ్మ మా వదిన వచ్చాక వాటి రుచి చూస్తోంది.ఉదాసీనంగా అమ్మ వంటింట్లో వంట చేస్తోంటే, సన్నజాజులు మాల కట్టడం నావంతయింది.నేను మాల కట్టడం ఏమిటా అని ఆశ్చర్యం వద్దు. మా అమ్మ వెనకాల తిరిగే నాకు అమ్మ పనులన్నీ అలవోకగా వచ్చాయి. పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నైన నాకు, ఆదివారం క్రికెట్ ఎంత ఆనందం ఇస్తుందో, అమ్మ వెనక చేసే పనులు అంతకంటే ఆనందమిస్తాయి.

బొద్దుగా, ముద్దుగా, పొడవుగా కట్టిన మాలను అమ్మకి అందించాను. అమ్మ నావైపు ప్రేమగా చూసి అందుకుంది. అన్నయ్య వాళ్ల కోసం ఎదురుచూస్తూ, ఎప్పుడు సోఫాలో వాలి నిద్రపోయానో నాకే తెలియదు. అమ్మ స్వరం

నాన్నగారి గదిలో నుండి ఏడుస్తూ వినబడితే నాకు మెలకువ వచ్చింది. అమ్మా, నాన్నగారు ఇంకా నిద్రపోలేదా? సమయానికి సరిగ్గా అన్ని పనులూ పూర్తి చేసే స్వభావం అమ్మది. వాళ్లు నిద్రకి దూరమై... మథనపడుతున్నారా?

"మీరే చెప్పండి. తను తప్ప నాకు ఎవరు ఆడపిల్లలు ఉన్నారు. తను చామనఛాయ రంగు పిల్ల. కనకాంబరం రంగు పట్టుచీరలో తను ఎంత బావుంటుంది? ఆ చీరనిండా జరీపుటాలే! ఆ చీర నాకు చాలా ఇష్టం. నాకు ఇష్టం లేదని ఒక్క మాట అనవచ్చు కదా? అన్ని మాటలతో దులిపెయ్యాలా? జుట్టు కత్తిరించవద్దని, చక్కగా జడ వేస్తానని, పూలు పెడతానని అంటే వినదు. మగవాడిలాగా ఏమిటా భుజం పైవరకూ వదిలేసిన కత్తిరించిన జుట్టు. ఆడపిల్ల ఆడపిల్లలాగా ఉండాలనుకోవడం నా తప్పా? ఎంత ఈసడించి మాట్లాడిందో తెలుసా?" అమ్మ ఏడుపుతో మాటలు పూర్తి చేయలేకపోయింది. నాన్నగారు అమ్మని ఓదారుస్తున్నారు. అన్నయ్య తలుపుకొట్టడం. నేను వెళ్లి తీయడం వాళ్ళు గట్టిగా కబుర్లు చెప్పుకుంటూ లోపలకు రావడం జరిగింది.

"నాన్నగారు పడుకున్నారు. సైలెంట్‌గా వెళ్లు" నేను అన్నయ్యని హెచ్చరించాను. వదిన ఏదో అనడానికి సిద్ధపడితే అన్నయ్య వారించి వెళ్లడం జరిగింది. నాన్నగారి గదిలోనుండి కూడా మాటలు ఆగిపోయాయి.

రాత్రి జరిగినది కల ఏమిటో అనే విధంగా అమ్మ ఉదయమే హడావుడిగా పనులు చేస్తూ కనిపించింది. విరిసిన ముద్దమందారంలాంటి అమ్మ మొహం చూస్తూ దినచర్యలకు సిద్ధపడటం నాకు ఇష్టమైన కార్యక్రమం.

అమ్మ ఉల్లిగారెలు, అల్లం చట్నీ, సెనగపప్పు చట్నీ చేసింది. కొందరు తీపి చట్నీ, కొందరు కారంగా ఉండే సెనగపప్పు తింటారు. ఇంట్లో అందరికోసం ఆలోచించే అమ్మను చూస్తే ఎంత ఓపిక అనిపిస్తుంది. వదిన చెప్పులతో డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చింది. అమ్మ కొత్తలో చెప్పింది. దేవుడి గదిలోకి, వంట గదిలోకి, డైనింగ్ హాలులోకి చెప్పులు వేసుకొని నడవద్దని. కొన్నాళ్ళు మానేసింది. మళ్లీ ఈరోజు....

నాన్నగారు, అమ్మ మొహాలు చూసుకున్నారు. అమ్మ మొహంలో చిన్నతనం స్పష్టంగా కన్పిస్తోంది.నాన్నగారు గంభీరంగా అన్నారు.

"అమ్మాయి జానకీ! డైనింగ్ హాల్‌లోకి చెప్పులతో వస్తావేంటి? అది మంచి పద్ధతి కాదు. మీ



సైన్సు ప్రకారం చూసినా టిఫిన్ తినేటప్పుడు, అన్నం తినేటప్పుడు శుభ్రత పాటించాలి కదా! చదువుకున్నదానివి. అర్థం చేసుకో!" వదిన వెనక్కి చూసింది. అన్నయ్య వస్తున్నాడు.

"ఇంక ఆవిడ పాఠాలు అయిపోయాయనుకుంటే మీరు మొదలుపెట్టారా? ఎవరి లిమిట్స్‌లో వాళ్ళుండండి. ప్రతి విషయం భూతద్దంలో చూసి అంటే ఒప్పుకోని. నా ఇష్టం వచ్చినట్లు ఉంటాను" వదిన చిరాకుగా అంది.

నాన్నగారు తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది.

"ఆడపిల్లకోసం ప్రాకులాడే మహాలక్ష్మికి నువ్వు ఆడపిల్లవు అవుతావనుకున్నాను. నీ ప్రవర్తన బావుండలేదు మార్చుకో! పెద్దవాళ్ళు చెప్పింది వినడం అలవాటు చేసుకో..!" నాన్నగారు అంత గట్టిగా ఏనాడూ మాముందు మాట్లాడటం తెలియదు.

అన్నయ్య "జానీ!" అని కొంచెం తగ్గమన్నట్లు పిలిచాడు.


వదిన వెటకారంగా అడిగింది.



## సగం ఇల్లు

కాంబోడియాలో ఒక జంట 40 సంవత్సరాల సంసారం తరువాత తగవులాడుకుని విడిపోయారు. ఊళ్ళో వాళ్ళు ఎంత ప్రయత్నించినా వాళ్ళని కలిపి ఉంచలేకపోయారు. ఆస్తిని చెరిసగం పంచుకున్నారు. ఆఖరికి అన్నీ పంచి పెట్టిన భర్త తమ ఇంటిని రంపంతో సగానికి కోసి ముక్కముక్కా విడదీసి వేరే చోటుకి పట్టుకునిపోయి మరో ఇల్లు కట్టుకున్నాడట. దాంట్లోకి తన తల్లిదండ్రుల్ని తెచ్చి పెట్టుకున్నాడుట. మిగిలిన సగం ఇంట్లో అతని భార్య ఇప్పుడు ఒంటరిగా నివసిస్తోంది.

-తటవర్తి




"నా ప్రవర్తన మార్చుకోకపోతే ఏమవుతుంది?" నాన్నగారు అనేశారు.

"మాకు దూరంగా వెళ్ళిపోండి. మా ఎదురుగా ఉండి, మమ్మల్ని బాధ పెట్టవద్దు" అమ్మ ఒక ప్రక్కన "ఏవండీ!" అని, అన్నయ్య "నాన్నగారూ!" అని పిలిచినా ఆయన విన్పించుకోలేదు. గారెలు అంటే ఎంతో ఇష్టపడే నాన్నగారు తినకుండా వెళ్ళిపోయారు.

"మమ్మల్ని వెళ్ళిపోమంటారా? అలాగే వెళతాం! మా ఇష్టం వచ్చినట్లు హాయిగా బ్రతుకుతాం" అంటున్న వదినను అన్నయ్య వారించాడు.

"అమ్మా! ఏమిటమ్మా ఇదంతా?" అన్నాడు.

"ఏమిటా? అడుగడుగునా మీ అందరి అభిరుచులకి నేను అనుగుణంగా ఉండాలి. అదే ఆమెగారి కోరిక. మీరు వీళ్ళను వదిలి వస్తారా? రారా?" వదిన నిలదీసింది.

"జానకీ! మీ మామగారు కోపంలో ఏదో అన్నారు. ఆయనకి పిల్లలంటే ప్రాణం. ఎవరూ ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు. అందరూ హాయిగా ఉండండి" అంది అమ్మ బరువుగా.

"అమ్మా! జానకిది ఆవేశ స్వభావం. నీ పిల్లే అనుకోమ్మా!" అన్నయ్య అమ్మతో అంటూంటే శేఖర్‌కి ఒళ్లు మండింది.

"అన్నయ్యా! ఏం మాట్లాడుతున్నావురా? భార్యకి సర్దుకోవాలని చెప్పడానికి బదులు అమ్మకి చెపుతున్నావా? అసలు నీ అసమర్థత వలననే ఇవన్నీ వస్తున్నాయి. రౌతు మెతకవాడైతే గుర్రం దానిష్టం వచ్చినట్లు ఆడిస్తుంది. బాగా తెలుసుకొని ప్రవర్తించమని చెప్పు" శేఖరం గట్టిగా చెప్పాడు.

"చూశారా? గుడ్డు వచ్చి పిల్లని వెక్కిరించిందిట. మీ తమ్ముడి వ్యవహారం అలా వుంది. బొడ్డూడని వాళ్లూ మనకి చెప్ప వచ్చినవాళ్ళే" ఈసడింపుగా జానకి అంది.

"సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మీ కంటికి బొడ్డూడని వాడిగా కన్పిస్తే మీకు దృష్టి దోషం ఉందన్నమాట" శేఖరం ఎగతాళి చేశాడు.

"చంటీ!" మహాలక్ష్మి పిలుపుతో శేఖరం ఆగిపోయాడు.

"తగాదాలు పెంచుకుంటే పెద్దవవుతాయి. అది మంచిపనా? నువ్వు టిఫిన్ తిని వెళ్ళు" మహాలక్ష్మి చిన్న కొడుకుతో అంది.

"చూశారా? చేయవలసినదంతా చేసి ఎలా ఏమీ ఎరగనట్లు అంటున్నారో చూడండి" వెటకారంగా జానకి అంటున్నా విననట్లే మహాలక్ష్మి ఉండిపోయింది.

* * *

శేఖరం కళ్లు సుదూర తీరాలవైపు చూస్తున్నాయి. మనసు గత స్మృతుల నుండి బయటకు రానంటోంది. ఎదురుగానున్న రేవతికి ఆ సమయంలో అతడు మరీ నచ్చాడు.

"సారీ! మిమ్మల్ని మీ గతంవైపు తీసుకెళ్లి బాధపెట్టాను" రేవతి మృదువుగా అంది. శేఖరం ఆ అమ్మాయివైపు చూస్తూ చెప్పాడు.

"వర్తమానానికి గతమే పునాది. మా అన్న వదిన వేరు వెళ్లిపోయారు. మా అమ్మ ఎంత ప్రాధేయపడినా వదిన వినలేదు. మా నాన్నగారు దూరంగా ఉంటే విలువలు తెలుస్తాయని అమ్మను సముదాయించారు"

"మీరు నేను ఉద్యోగంలో చేరినప్పటినుండే ప్రేమంటూ గొడవ చేస్తున్నారు. మీరు నా సాటి ఉద్యోగి. మిమ్మల్ని చూసి ఫ్రెష్ అపాయింట్‌మెంటని అనుకొన్నాను. అంత పట్టుదలతో మా కంపెనీలో జాబ్ తెచ్చుకొంటారనుకోలేదు" రేవతి నవ్వింది.

"మీరు మా వీధిలోకి కొత్తగా వచ్చినప్పుడే చూశాను. ఉద్యోగం, వివరాలు తెలుసుకొన్నాను. నా చదువు పూర్తవగానే మీ కంపెనీ పెట్టిన ఇంటర్వ్యూలో సెలక్టయి వచ్చాను. ఇదంతా ఎందుకోసం? మిమ్మల్ని చూడటం

కోసం, మీ సన్నిధిలో కాలం గడపడం కోసం, ఇప్పటికైనా నా భావాలు అర్థం చేసుకోండి'' రేవతి మృదువుగా అంది.

శేఖరం ఆమెవైపు చూడలేదు. కాస్త దూరంలో ఆడుకుంటున్న పిల్లల సందడి గమనిస్తున్నాడు. పార్కులో చీకటి పడకుండానే వీధి దీపాలు, పార్కులోనివి వెలిగాయి. చల్లటి గాలి వాళ్లని లాలిస్తూ, ఊసులేవో చెపుతూ కదిలి వెళుతోంది. శేఖరంది నిర్మోహమాట ప్రవృత్తి. అయినా ఈ అమ్మాయి దగ్గర అది పనిచేయడం లేదు. నిశ్చలమైన కంఠంతో అన్నాడు.

"చూడండి రేవతీ! నాకు కావలసిన భార్య కంటికి నదురుగా కన్పించే అందగత్తె కాదు. ధనవంతురాలు కాదు. బాగా చదువుకొన్న విద్యావంతురాలు కాదు. మా అమ్మకు కూతురిగా తృప్తిని కలిగించే అమ్మాయి కావాలి. మా అమ్మకు పొడవైన జడగల కోడలు, పూలతో, కంటికాటుక రేఖలతో వినయంగా ఉండి, పెద్దలకు గౌరవమిచ్చే కోడలు కావాలని కోరిక. చక్కటి చీరతో కనువిందుచేసే పిల్ల కావాలి. నన్ను భర్తగా మెప్పించనవసరంలేదు. అమ్మను సంతృప్తి పరిచే మగువ కావాలి. మిమ్మల్ని మీరు పరిశీలనగా చూసుకోండి. మా అమ్మకిష్టమైన అమ్మాయి మీలో లేదు. నాకు పెళ్లి కాకపోయినా ఫర్వాలేదు. మా అమ్మను బాధపెట్టే అమ్మాయిని మాత్రం జీవితంలోకి ఆహ్వానించను. వస్తాను. మరెప్పుడూ ప్రేమంటూ నావెంట పడకండి'' ఆ రాత్రి చాలాసేపు రేవతికి నిద్ర పట్టలేదు. ఆమెకి తను ధరించే రకరకాల దుస్తులు, తన పోనీటెయిల్ గుర్తువచ్చాయి. మొదటిసారిగా తన గురించి ఆలోచించింది.రేవతి అస్థిమితంగా అటూ, ఇటూ పక్కపై దొర్లసాగింది. 'మా అమ్మకి నచ్చిన కోడలు మాత్రమే నాకు భార్యగా రాగలదు. లేకపోతే పెళ్లి మాట తలపెట్టను. దయచేసి నా వెంట పడకండి' వద్దన్నా పదే పదే శేఖరం మాటలు గుర్తు వస్తున్నాయి. 'మనసిచ్చినదే నిజమైతే.......' పాట గుర్తు వచ్చింది. ఆమె తనని తాను పరిశోధించసాగింది.

★ ★ ★

లండన్ కంపెనీ పనిమీద వెళ్లి, ఆరు నెలలకు తిరిగి వచ్చిన కొడుకును మహాలక్ష్మి ఆనందంగా చూసుకుంది. ఎన్ని కబుర్లో? ఎంత హడావుడో... మహాలక్ష్మి కాలు నేలపై నిలవడం లేదు. కొడుకుని క్షణం వదలడం లేదు.

"లక్ష్మీ! నీ సంబరమేనా? మనమనుకొంటున్న విషయం చెప్పేది ఉందా?'' భర్త మహాలక్ష్మిని అడిగాడు.

"మీరే చెప్పండి'' ఆవిడ భర్తనే పురమాయించింది.

"చంటీ! మనం రేపు పెళ్లి చూపులకి వెళుతున్నాం! సంబంధం చాలా గొప్పది. చదువు, అంతస్థు, వివేకం కలిగిన పిల్ల. రేపు వస్తామని వాళ్లకి చెప్పాను. అందంలో, వినయంలో ఆ అమ్మాయి పెట్టింది పేరు'' ఆయన కొడుక్కి చెప్పారు. శేఖరం గొంతు పెగల్చుకుని అన్నాడు. "నాన్నగారూ! ఇప్పుడే నాకు పెళ్లి ఎందుకు? వదిన విషయంలో ఇలాగే అనుకొని వెళ్లాం. ఆ అనుభవం మనకి చాలాదా?'' మహాలక్ష్మి నవ్వింది. "ఈ సంబంధం విషయంలో అలాంటి భయం మన పడనక్కరలేదురా! నా మాట విని చూడు. పెళ్లిచూపులయ్యాక చెప్పు'' తండ్రి కూడా అదే చెప్పారు.

★ ★ ★

శేఖరం తండ్రి నవ్వుతూ కొడుకుతో అన్నారు.

"అమ్మాయిని చూడరా! వీక్లీ తర్వాత చూడవచ్చు''

మహాలక్ష్మి మృదువుగా అడిగింది.

"నీ పేరు ఏమిటమ్మా!'' "రేవతండీ!'' వినయమైన ఆ గొంతు చూసి శేఖరం చటుక్కున తల ఎత్తాడు.రేవతి అతడిని నవ్వుతూ చూసింది. తలలో సన్నజాజులు, మరువం కట్టిన మాల, సొగసైన కనుదోయికి సన్నటి కాటుక రేఖలు, నుదిటిపై తిలకం, చేతులను ఒడిలో పెట్టుకుని, ముగ్ధలాగా కూర్చుంది.పసుపురంగు వర్క్ శారీలో పసుపు కొమ్ములాగా మెరిసిపోతోంది. మహాలక్ష్మి వాళ్ళిద్దరివైపు చూసింది. ఒకరి అందానికి ఒకరు దీటుగా ఉన్నారు. ఆమె కొడుకుతో అంది.

"చంటీ! ఈ అమ్మాయి మాకు ఉత్తరం రాసింది. తర్వాత ఫోనులో మాట్లాడింది. మన ఇంటికి ఎలాంటి అమ్మాయి రావాలో అలాంటి అమ్మాయేనన్పించింది. తను మాట్లాడుతూంటే నా ఇష్టాలు తను చెబుతుంటే మేము ఆశ్చర్యపోయాం'' మహాలక్ష్మి కొడుకు దగ్గరకు వచ్చింది.

"చంటీ! చూడరా? లక్ష్మీదేవిలాగా కన్పిస్తోంది. మనం కావాలని పట్టుబట్టి, మన జీవితాలలోకి వస్తోంది. ఈ అమ్మాయి మన ఇంటి దీపంరా!'' అని అంది. శేఖరం సంతృప్తితో నిండిన అమ్మ మొహం చూశాడు. అమ్మ మనసు గెలుచుకున్న రేవతివైపు అభిమానంగా చూశాడు. ముసిముసిగా నవ్వుతూ, అతడివైపు రేవతి ప్రేమగా చూసింది.

★



## టర్నింగ్ పాయింట్!

వెన్నెల చిత్రంతో పరిచయమైన పార్వతి మెల్టన్‌కి ఆ తర్వాత చేసిన చిత్రాలేవీ అంతగా పేరు తీసుకురాలేదు. మళ్లీ కొంత గేప్ తర్వాత 'జల్సా'లో ఆమె చేసిన పాత్ర అందర్నీ ఆకట్టుకుంది. ఇదే ఆమెకి టర్నింగ్ పాయింట్ అయింది. 'పులి' చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన నటిస్తోంది. ఇప్పుడు ఆమె ఆశలన్నీ 'పులి' పైనే ఉన్నాయి. కనీసం ఈ చిత్రమైనా ఆమె కెరీర్‌కి కలిసివస్తుందేమో చూడాలి. ఆల్ ది బెస్ట్ పార్వతీ!

